క్లుప్తంగా

యనమలకుదురులో పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివాని దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న శ్రీ శనీశ్వరస్వామివారికి భక్తులు తైలాభిషేకాన్ని చేపట్టారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఏసీపీ జనార్దన్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామివారి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ గంగాధర రావు, అర్చకుడు సాగర్ పాల్గొన్నారు.

వికాస్ కాలేజీలో టెక్నికల్ స్కిల్స్ సెమినార్

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ విద్యాసంస్థలో శనివారం టెక్నికల్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ఇన్ ఐటీ ఇండస్ట్రీస్ సెమినార్ జరిగింది. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన శుక్లాల్ సింగ్(బెంగళూరు) మాట్లాడుతూ.. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో నాలెడ్జ్ సంపాదించాలన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, వైస్ చైర్మన్ ఎన్.సత్యనారాయణరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఎన్.కీర్తిరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.కిషోర్‌బాబు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: తాడిగడపలో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామరావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ - 2 కట్టకు చెందిన జుజ్జవరపు సంధ్యారాణి అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కుమార్తె(18) ఇంటర్ ఫెయిల్ కావడంతో ఇంట్లోనే ఉంటుంది. కాగా ఈ నెల 12వ తేదీన సంధ్యారాణి కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం వెతికినా జాడ తెలియలేదు సంధ్యారాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

23 నుంచి పెదపులిపాక ఆలయ వార్షికోత్సవం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి, శ్రీ విజయ సుందరేశ్వస్వామివారి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు అష్టమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నుంచి ప్రతి రోజు శ్రీ వాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, మహాగణపతిపూజ, అనుగ్రహభాషణ, మంగళ హారతి, సాయంత్రం నిత్యార్చన, రాత్రి పవళింపుసేవ నిర్వహిస్తామన్నారు.

భూముల రీ సర్వే

విజయవాడరూరల్: జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకంలో భాగంగా విజయవాడ రూరల్ మండలంలో 3వ ఫేజ్‌లో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, రాయనపాడు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. షాబాదు గ్రామంలో సెకండ్ ఫేజ్ రీ సర్వే జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయ, నాలా అనుమతుల కోసం దరఖాస్తు చేసిన భూములు, చారిటీస్ భూములు, దేవదాయశాఖ, వక్ఫ్ భూములను రోవర్ల ద్వారా డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

చురుగ్గా పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు

రూ.1.45 కోట్లతో బాపులపాడులో నిర్మాణం



నిర్మాణంలో ఉన్న బాపులపాడు పీహెచ్‌సీ భవనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.1.45 కోట్ల వ్యయంతో ఆరు పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శిథిలావస్థకు చేరిన భవనంలో కొన్నేళ్లుగా అరకొర మౌలిక సదుపాయాలతో నెట్టుకొస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేసేందుకు గానూ చేపట్టిన నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా బాపులపాడు పీహెచ్‌సీ ఎంపిక కావటంతో సకల సదుపాయాలతో కొత్త భవనం సిద్ధమవుతుంది. ఈ నూతన భవనాల నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి.

రూ.1.45 కోట్లతో ఆస్పత్రి భవనం..

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మండల కేంద్రంలోని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. ప్రస్తుత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్యులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో శ్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి పడిపోవటం, వర్షం నీరు రాకటంతో గర్భిణులకు డెలివరీ చేయలేక వైద్యులు పొరుగు ఆస్పత్రికి పంపించేవాళ్లు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2021 ఫిబ్రవరిలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.1.45 కోట్ల నిధులు బాపులపాడు పీహెచ్‌సీకి మంజూరు చేసింది. దీంతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సువిశాల ప్రాంగణంలో నూతన భవనంలో ఆరు ఇన్ పేషంట్ గదులు, నర్సింగ్ రూం, డెలివరీ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, రెండు డాక్టర్ల గదులు, రిసెప్షన్ నిర్మిస్తున్నారు. రోజుకూ దాదాపు 100కి పైగా ఇన్‌పేషంట్ సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రి సకల సదుపాయాలతో రూపుదిద్దుకుంటుంది.

రూ.50 లక్షలతో ఆన్‌లైన్ రికార్డు భవనం..

పీహెచ్‌సీ ప్రాంగణంలోనే పేషంట్ రికార్డు ఆన్‌లైన్ చేసేందుకు అదనంగా రూ.50 లక్షల వ్యయంతో మరో భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవలే నిధులు మంజూరు చేసింది. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగి యొక్క వ్యాధి వివరాలను నమోదు చేసి, వాటిని ఆన్‌లైన్ రికార్డుగా భద్రపర్చేందుకు ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు



పోరంకిలో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు పోరంకిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోరంకిలో జాతీయ రహదారి వెంట వ్యర్థపదార్థాలు, చెత్త తొలగించామన్నారు. గ్రామాల్లో చెత్త వేయటానికి ప్రత్యేకంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశామని, ప్రజలు చెత్తను డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలని సూచించారు. డ్రైయిన్లలో చెత్త వేస్తే మురుగునీరు పారుదల జరగకుండా సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. అన్ని గ్రామాల్లో చెత్త సేకరణకు ప్రతి రోజు వాహనాలు వస్తున్నాయని, ఆ వాహనాల వెంట వచ్చే సిబ్బందికి చెత్త అందజేయాలన్నారు.

రామవరప్పాడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో శనివారం జాతీయ రహదారితో పాటు ప్రధాన గ్రామంలో సైడు డ్రెయిన్లను పూడుకతీయించి, చెత్తను తొలగించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ.. అంతర్గత రహదారుల్లోని చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందిచే తొలగించి, డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీరవల్లిలో 312 మందికి వైద్య పరీక్షలు



వీరవల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పీఏసీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడకు చెందిన అను హాస్పిటల్స్ వైద్యులు ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. బస్సులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన మొబైల్ ల్యాబ్ ద్వారా గుండె సంబంధిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 312 మందికి వైద్య సేవలు అందించగా, 87 మందికి ఈసీజీ, 37 మందికి 2డీ ఈకో పరీక్షలు చేశారు. పోతకమూరి చటర్జీ బ్రదర్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరంలో స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. మమతల పందిరి సేవా సమితి అధ్యక్షుడు లంక రమేష్, సర్పంచ్ పిల్లా అనిత, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి, గ్రామ ప్రముఖులు ఉమా వరప్రసాద్, కోడెబోయిన బాబి, గూడవల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ట్రామా కేర్‌తో ప్రాణాలకు రక్షణ

పి.సిమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు



పీజీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ స్వాతి పూర్ణిమ

గన్నవరంరూరల్: ట్రామా కేర్‌తో ప్రాణాలు రక్షించేందుకు వైద్యులు కంకణ బద్ధులు కావాలని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్ పి.సిమ్స్‌లో శనివారం జరిగిన ఇంటర్నేషనల్ ట్రామా లైఫ్ సపోర్ట్ కోర్సు శిక్షణ కార్యక్రమంలో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఈ కోర్సులో నిపుణులు చెప్పే అంశాలు క్షతగాత్రుల ప్రాణాలను రక్షించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజారోగ్య రక్షణలో వైద్యులు ఈ ప్రమాణాలు పాటించటం ద్వారా వారి విధులను, కర్తవ్యాలను నిర్వహించటం ద్వారా ప్రజల మన్ననలు పొందుతారని చెప్పారు. ప్రాణాలను రక్షించటం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారన్నారు.

పీజీలు నైపుణ్యం సాధించాలి..

ప్రపంచంలో 15 నుంచి 24 ఏళ్ల లోపు వారు 73 శాతం మంది ఈ ట్రామాకు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రుల ఇబ్బందిని వేగంగా అంచనా వేయటం, సరైన నైపుణ్యంతో రోగిని తరలించటం, ప్రాణాంతక పరిస్థితుల్లో తీసుకునే చర్యల ద్వారా కాపాడటం, చికిత్సను అందించటం ముఖ్యమన్నారు. ఆత్మస్థైర్యాన్ని, మనోధైర్యాన్ని కలిగించటం ఈ కోర్సులో నిపుణులు తెలియజేయటం అభినందనీయమని చెప్పారు. రక్త స్రావం అరికట్టడం, ఛాతీ, పొట్ట ట్రామా వివరాలు గుర్తించటం, తల, మెడ, వెన్నుపూస ట్రామా పరిస్థితి అంచనా వేయటం ముఖ్యంగా జరుగుతుందన్నారు. వాటిని నిరంతర అధ్యయనంతో పీజీలు నైపుణ్యం సాధించి ప్రపంచం గర్వించే వైద్యులుగా సమాజానికి సేవలందించాలని కోరారు. కోర్సు డైరెక్టర్ డాక్టర్ డి.చంద్రమౌళి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ బీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్ కుమార్, కోర్సు ఆర్గనైజర్ డాక్టర్ వి.కళ్యాణ్ చక్రవర్తి, అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ స్వాతి పూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీలు వితరణ



ఉంగుటూరు: పెద అవుటపల్లి పీహెచ్‌సీకి బోయపాటి వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు బోయపాటి సీతారామంజనేయులు, శ్రీమన్నారాయణలు శనివారం కుర్చీలు అందజేశారు. పీహెచ్‌సీ అవసరాలకు రూ.5 వేలు విలువైన కుర్చీలను పీహెచ్‌సీ డాక్టర్ కరిముల్లాకు అందించారు. దాతలకు పీహెచ్‌సీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, విశ్రాంత హెచ్ఎం డీవీ జవహర్‌లాల్ పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



ఉంగుటూరు: విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్ అసోసియేషన్ స్పోర్ట్స్‌మీట్‌లో తమ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని పెద అవుటపల్లి శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.జి.ఎస్ సాయిబాబా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్‌మీట్‌లో విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన 40 పాఠశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రన్నింగ్, లాంగ్‌జంప్, చెస్ విభాగాల్లో సాయిశ్రీనివాస హైస్కూల్ వరుసగా రెండో సారి ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచిందన్నారు. పీఈటీ గాంధీ, విజేతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

వెంకటేశ్వరస్వామి దీక్ష స్వీకరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పలువురు భక్తులు శనివారం వెంకటేశ్వరస్వామివారి మాలధారణ దీక్ష స్వీకరించారు. స్వాములకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు దుస్తులు, మాలలు, పూజా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను, మాలధారణ నిర్వహించారు. దీక్ష చేపట్టిన భక్తులకు ఉచితంగా దుస్తులు, మాలలు అందిస్తామని ట్రస్టీ తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



కుందేటి భారతి

పెనమలూరు: మండల పరిధిలో వలంటీర్లు అందించిన ఉత్తమ సేవలకు ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. పెనమలూరు మండలంలో 1 సేవా వజ్ర, 5 సేవా రత్న, తాడిగడప మున్సిపాలిటీలో 5 సేవా రత్న అవార్డులు ప్రకటించారు. పెనమలూరు మండలంలో వణుకూరు -1లో వలంటీర్‌గా ఉత్తమ సేవలు ప్రజలకు అందించిన కుందేటి భారతికి సేవావజ్ర అవార్డు ప్రభుత్వం ప్రకటించింది. మండల పరిధిలోని వణుకూరు -1లో షేక్.కరీమా, చోడవరంలో దేవరపల్లిరాణి, గంగూరు -1లో దేవరపల్లి కుమారి, పెదపులిపాకలో నాగం దుర్గ, గంగూరు -2లో వడ్డాది నాగలక్ష్మికి సేవారత్న అవార్డులు వచ్చాయి. మండల పరిధిలో ఉన్న మిగతా 225 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు ఇచ్చారు.

తాడిగడపలో..

తాడిగడప మున్సిపాలిటీలో ఐదుగురికి సేవారత్న అవార్డులు వచ్చాయి. యనమలకుదురు -2లో షేక్.అస్మ, కానూరు -1లో అర్జా లక్ష్మిశిరీష, కానూరు -4లో ఎండీ.రేష్మా, తాడిగడప -1లో మాచర్ల శ్రీలక్ష్మికుమారి, కానూరు -5లో ఎస్‌కె.నూర్జహాన్‌లకు అవార్డులు వచ్చాయి. మిగతా 563 మంది వలంటీర్లకు సేవారత్న అవార్డులు వచ్చాయి. అవార్డులు పొందిన వలంటీర్లకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహం ప్రకటించింది.

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

డీఈఓ. తాహెరా సుల్తానా



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

గన్నవరం: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సమాయత్తం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో శనివారం నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి పరీక్షలపై విద్యా శాఖాధికారులు, హెచ్‌ఎంలతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. మార్చి 18 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పూర్తి సమయం చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్ఫూర్తి మెటీరియల్‌ను చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు కె.రవికుమార్, కమల, హెచ్ఎం ఎస్.రవీంద్రభవాని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపిశెట్టి



గోపిశెట్టి వీరాస్వామి

గన్నవరం: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శిగా గన్నవరానికి చెందిన గోపిశెట్టి వీరాస్వామి నియమితులయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సూచన మేరకు గోపిశెట్టిని నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతం నిమిత్తం సామాజిక న్యాయాన్ని పాటిస్తూ వీరాస్వామిని నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీరాస్వామిని ఎమ్మెల్యే వంశీతో పాటు ఎంపీపీ అనగాని రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ తోట కరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి రామాంజనేయులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. గౌసాని తదితరులు అభినందించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి నూతన దేవాలయం ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు తొలిరోజైన శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 19వ తేదీన స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గణపతి, శ్రీ కృష్ణ, ధ్వజ, శిఖర పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రతిష్ఠ చేసేందుకు ముందుగా జరిగే క్రతువులను వేదపండితులు ప్రారంభించారు. దంపతులు పీటలపై కూర్చుని ప్రతిష్ఠా ఉత్సవాలను ప్రారంభించారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ సారథ్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.

వల్లభానగర్ లే అవుట్‌పై వాస్తవాలు తేల్చండి

ఉయ్యూరు: వల్లభానగర్ లే అవుట్‌పై వాస్తవాలు తేల్చాలని కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీ సభ్యులు కోరారు. స్థానిక కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అధ్యక్షతన సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు బేగ్, గోన మదన్, గుంజా సుధాకర్‌లు నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆరోపణలు వస్తున్న వల్లభానగర్ లే అవుట్‌పై వాస్తవాలు బయట పెట్టాలన్నారు. కాపు కల్యాణ మండపం, షాదీఖానాలు మున్సిపాలిటీ నిర్వహణలోనే కొనసాగాలని సూచించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కంకిపాడు: మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో రూ.3.50 లక్షలు పంచాయతీ నిధులతో సిమెంటు రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చిట్టూరి కోటయ్యబాబు, షేక్ అహ్మద్, బాకీ రాజు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్

పెనమలూరు: గంజాయి కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను పట్టుకోవటానికి ఎస్పీ నయాం అస్మి ఆదేశాల మేరకు డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దీంతో పరారీలో ఉన్న కాటూరు గ్రామానికి చెందిన షేక్.వాజిద్, ఉయ్యూరు టౌన్‌కు చెందిన లంకపల్లి సతీష్, విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఎర్రంశెట్టి భార్గవ్‌లను శనివారం అరెస్ట్ చేశామన్నారు. నిందితులను విజయవాడ కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని సీఐ రామారావు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన



పెనమలూరు: హఠాత్తుగా గుండెనొప్పి వస్తే కార్డియో పల్మనరీ పునర్జీవనం(సీపీఆర్) చేయాలని క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ శివరాం తెలిపారు. కానూజీ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో అను హాస్పిటల్స్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండె పోటు కారణంగా శ్వాస తీసుకోవటం ఇబ్బంది పడితే వెంటనే ఛాతి కుదింపు(సీపీఆర్) అత్యవసర ప్రక్రియ అన్నారు. దీంతో రక్త ప్రసరణ పాక్షికంగా పునరుద్ధరించవచ్చని తెలిపారు. అలాగే నోటి నుంచి గాలి పంపితే మెదడు, గుండెకు ఆక్సిజన్ అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటూ గుండెపోటు నుంచి కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.